## క్లుప్తంగా

### రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి..

**జూలూరుపాడు:** ఖమ్మం – కొత్తగూడెం మధ్య గల ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ వర్షాలకు రహదారి పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఖమ్మం – కొత్తగూడెం మధ్య వందలాది వాహనాలు రాకపోకలు వచ్చిపోతుంటాయని, రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు నివారించాలని కోరారు.

### మహిళలకు చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న శరత్‌బాబు

**పాల్వంచ:** మహిళలు వృత్తి విద్యాకోర్సుల్లో రాణించడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని నవలిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ శరత్‌బాబు అన్నారు. నవ మహిళా సాధికార కేంద్రంలో తాటిఆకుల కళాకృతులు, వివిధ రకాల యూనిఫాంలను కుట్టి విక్రయించడం ద్వారా వచ్చిన రూ.1.50 లక్షల చెక్కును మంగళవారం మహిళలకు అందించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ మహిళలు వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎంజీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

### 43ఏళ్ల పాటు సేవలు అభినందనీయం

**కొత్తగూడెంటౌన్:** పోలీసుశాఖలో దాదాపు 43 ఏళ్లపాటు సేవలందించడం అభినందనీయమని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాజేందర్ దంపతులను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఏసోబు పాల్గొన్నారు.

### ఎన్ఎండీసీ విస్తరణకు చర్యలు తీసుకోవాలి


రేణుకాచౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

**పాల్వంచ:** పాల్వంచలో మూతబడిన ఎన్ఎండీసీ కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ జలీల్, బానోతు బాలు నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి మాట్లాడుతూ ఎన్ఎండీసీ విస్తరణపై యాజమాన్యం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# నానోపై అవగాహన




- గుళికలతో పోలిస్తే మంచి పనితీరు
- రైతుల దృష్టి మళ్లాలంటున్న అధికారులు


నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ (ఫైల్)

**పాల్వంచరూరల్:** ఈ ఏడాది వానాకాలం పంటలు సాగు చేసిన రైతులకు యూరియా కొరత వేధిస్తున్నా.. ప్రత్యామ్నాయంగా వచ్చిన నానో లిక్విడ్ యూరియాపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దీనిని వినియోగించుకునే విధంగా రైతు దృష్టిని మళ్లించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక టెక్నాలజీ కూడా అందుబాటులోకి వచ్చింది. సాగులో ఖర్చు తగ్గించుకునేందుకు అధిక పంట దిగుబడులు పొందేందుకు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. యూరియా కొరత కారణంగా రైతులు సీజన్ మొదలు నుంచి ఇక్కట్లు పడుతున్నారు. యూరియాను తగ్గించాలని, ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను వినియోగించడం వలన మంచి ఫలితం ఉంటుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు మాత్రం యూరియా బస్తాలే కావాలని నిరీక్షిస్తున్న పరిస్థితి. దీనిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో నానో యూరియాను వినియోగించడానికి ఆసక్తి చూపడం లేదు.

**నానో యూరియాతో ప్రయోజనాలు...**

నానో యూరియా వినియోగించిన రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. సాధారణ యూరియా వాడితే పంటకు 30 శాతం మాత్రమే మొక్కలకు చేరుతుందని, అదే నానో యూరియాను వినియోగిస్తే 80 శాతం ప్రయోజనం కలుగుతుందంటున్నారు.

**విచ్చలవిడిగా ఎరువుల వినియోగం..**

వరి సాగుచేసిన రైతులు విచ్చలవిడిగా ఎరువులను వినియోగిస్తున్నారు. నేలకు జీవం భూసారపెంపుతో అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నా సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో గతేడాది 1,64,662 ఎకరాల్లో వరి సాగుచేసిన రైతులు ఈ ఏడాది 1,74,450 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి గతేడాది 2,03,560 ఎకరాల్లో, ఈఏడాది 2,21,999 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. వరి ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటంతో రైతులు అధికంగా వరిసాగు చేశారు. గతేడాది నుంచి మొగిపురుగు విజృంభించడం, ఇతర తెగుళ్లు పైరును ఆశించడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను పిచికారీ చేస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం బదులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు పాటు భూసారం పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

**అధిక వర్షపాతం ముంచింది..**

ఈ ఏడాది వానాకాలం ఆరంభం నుంచి వర్షాలు అనుకూలించాయి. తొలుత అడపాదడపా కురిసిన వర్షాలు తర్వాత అధికంగా కురవడంతో పత్తి, వరిపంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం వరి పొట్టదశలో ఉండటం, పత్తి పూత, కాత దశలో ఉండటం, దీనికి తోడు ప్రతీరోజు వర్షం కురవడం, ముసురు పెట్టడంతో కాయలు నల్లబడి పోవడంతో ఒక్కో రైతు సగటున నాలుగు, ఐదుసార్లు మందులను పిచికారీ చేస్తున్నారు. ఇంకా పంట దిగుబడి చేతికి వచ్చే సరికి ఎన్నిసార్లు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**యూరియా దొరకలేదు..**


ఈ ఏడాది యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఎంత ప్రత్నించినా యూరియా బస్తాలు దొరకలేదు. దీంతో చేసేది లేక లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియాను పంటలకు వినియోగించా బాగానే పని చేస్తుంది.

– రామిరెడ్డి, రైతు, జగన్నాథపురం

**నానోపై అవగాహన కల్పించాలి..**


యూరియా వినియోగానికి అలవాటు పడిన రైతులు అవగాహన లోపం నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి నానో యూరియాను పంటలకు పిచికారీ చేయించాలి.

– డి.రాములు, రైతు, సోములగూడెం

**రసాయనిక ఎరువులు తగ్గించాలి..**


సేంద్రియ ఎరువులు వినియోగిస్తే పంటలకు అన్నిరకాల పోషకాలు అందుతాయి. రసాయన ఎరువుల వలన భూసారం దెబ్బతింటుంది. జీవామృతం వాడితే అధిక దిగుబడులు వస్తాయి. నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్నాం.

– శంకర్, ఏఓ, పాల్వంచ

## దసరా ఉత్సవాలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**ఇల్లెందు:** స్థానిక జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించనున్న దసరా వేడుకలను విజయవంతం చేయాలని ఉత్సవ మండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు డానియేల్, పులి సైదులు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది వేడుకల్లో జోష్ నింపేందుకు టీవీ కళాకారులను రప్పిస్తున్నట్లు తెలిపారు. స్థానిక డ్యాన్సర్ల కళా ప్రదర్శనలు కూడా ఉంటాయని, మైసూర్‌ను తలపించే రీతిలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. పాలపిట్టను తీసుకొచ్చి ప్రజల దర్శనార్థం ప్రత్యేక బోనులో ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, నాయకులు మడుగు సాంబమూర్తి, జానీబాబా, చెన్నూరి శ్రీనివాస్, సుదర్శన్ కోరీ, జాఫర్, చిల్లా శ్రీను పాల్గొన్నారు.

## రైల్వేలైన్ త్వరగా పూర్తి చేయండి..

**కొత్తగూడెంఅర్బన్:** సారపాక వరకు మంజూరు చేయబడిన పాండురంగాపురం – మల్కన్‌గిరి రైల్వే లైన్‌ను త్వరగా పూర్తిచేయాలని, కొత్త రైల్వే ప్రాజెక్టు సర్వే పూర్తి చేయాలని కోరుతూ రైల్వే శాఖ మంత్రికి, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలానికి ప్రయాణించే యాత్రికులకు సారపాక ఒక కీలకమైన రవాణా కేంద్రమని, పనులు పూర్తి చేయడం వలన భక్తులకు మెరుగైన సౌకర్యం లభిస్తుందని, రోడ్డు మార్గాలలో రద్దీ తగ్గుతుందని, పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని లేఖలో తెలిపారని వివరించారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

**పాల్వంచ:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స్థానిక సంస్థల ఎన్నికలు గొప్ప అవకాశంగా మార్చుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కొత్తగూడెం ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పాత పాల్వంచలో వనమా స్వగృహంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వనమా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని, అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని, దీనిని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వివరించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లో తులం బంగారం, నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి అమలు చేయడం లేదన్నారు. యూరియా సక్రమంగా ఇవ్వక పోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ చేసి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కిలారు నాగేశ్వరరావు, బత్తుల వీరయ్య, కాపు సీతామాలక్ష్మి, వేల్పుల దాము, మంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాథం, శ్రీరామ్మూర్తి, కాంపెల్లి కనకేష్, కొట్టి వెంకటేశ్వర్లు, అన్వర్ పాషా, సింధు తపస్వీ, అనుదీప్, నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## నిలిచిన డిపెండెంట్ ఉద్యోగాలు


గనిలో పని చేసి వస్తున్న కార్మికులు

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థలో ఐఈడీ నార్మ్స్ కంటే అధికంగా కార్మికులు ఉన్నారని నాలుగు నెలలుగా మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన 270 మంది కార్మికుల పిల్లలకు ఇవ్వాల్సిన డిపెండెంట్ ఉద్యోగాలు నిలిచిపోయాయి. సింగరేణి సంస్థలో కొంతకాలం పనిచేసి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయి, ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల పిల్లలకు కంపెనీ 2018 నుంచి ఉద్యోగాలు ఇస్తోంది. అయితే నాలుగు నెలల క్రితం ఇంటర్వ్యూలు నిర్వహించారు కానీ, మిగతా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. యాజమాన్యం స్పందించి వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

**2400 మంది సర్‌ప్లస్ కార్మికులు..**

సింగరేణి సంస్థలో 15 ఏళ్ల నుంచి కొత్తగనులు రాక, పాత గనులు మూతపడతున్నాయి. దీంతో 2010లో 65 వేల మంది ఉన్న కార్మికుల సంఖ్య ప్రస్తుతం 40 వేలకు చేరింది. ఇదే వరుసలో ఇల్లందులోని జేకే ఓసీలో సుమారు 700 మంది, శ్రీరాంపూర్‌లోని ఆర్కే–5 గనిలో 1700 మంది కార్మికులు మొత్తం 2400 మంది ఎక్కువగా ఉన్నారని యాజమాన్యం చెబుతోంది. ఆర్కే–5 కార్మికులను అక్కడి ఏరియాలోనే అడ్జస్ట్ చేయగా, జేకే–5 కార్మికులను కొత్తగూడెం ఏరియాకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు సమాచారం.

**నిలిచిపోయిన మెడికల్ బోర్డ్...**

సింగరేణి సంస్థలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ మార్చి 21 నుంచి తాత్కలికంగా నిలిచిపోయింది. మార్చి 31న సీఎంఓ సుజాత ఉద్యోగ విరమణ పొందారు. ఆ తరువాత ఆ సీట్‌లోకి కిరణ్‌రాజ్‌కుమార్ వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక్క మెడికల్ బోర్డ్ కూడా జరగకపోవడం గమనార్హం. అదేమంటే ఆ మధ్యలో మెడికల్ బోర్డ్‌పై ఏసీబీ దృష్టి పెట్టటం, కొత్తగూడెం కార్పొరేట్ ఉద్యోగిని, రుద్రంపూర్‌లో మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనాటి నుంచి మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ నిలిచిపోవటంతో సుమారు రెండు వేల మంది కార్మికులు వెయిటింగ్‌లో ఉన్నారు.

**సర్‌ప్లస్ కారణంగానే నిలిచిపోయింది..**


సింగరేణిలో గనుల్లో నిక్షేపాలు అడుగంటిన నేపథ్యంలో కొన్ని గనులు మూత పడుతున్నాయి. కొంతమంది కార్మికులు సర్‌ప్లస్‌గా ఉన్నారు. ఇది ఐఈడీ నిబంధనలకు విరుద్ధం. ఉద్యోగాలు ఇవ్వటానికే కంపెనీ మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను చేపట్టింది. ఈ విషయాన్ని కార్మికులు గమనించాలి.

– జీవీవీ కిరణ్‌కుమార్, జీఎం పర్సనల్ వెల్ఫేర్

### ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

**ఇల్లెందురూరల్:** యాసంగి వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఏ లాల్‌చంద్‌కు అందజేశారు. ఈసందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు నాయిని రాజు, ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న మాట్లాడుతూ గత సీజన్‌లో వరి పంటను ప్రభుత్వానికి రైతులు విక్రయించినా నేటికీ చాలామందికి బోనస్ అందలేదని, ప్రస్తుతం యాసంగి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి వెంటనే బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గతంలో ప్రకటించిన భోనస్‌ను మాటలకే పరిమితం చేసిందని, ఆరు గ్యారటీల విషయంలోనూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. హామీల అమలులో గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత సీఎం నడుస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జూకంటి గాంధీ, శ్రీరాం కోటయ్య, ఆజ్మీర బిచ్చా, శాంతారావు, రమేష్, శంకర్, సావిత్రి, బాలస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే స్ఫూర్తితో ఉద్యమించండి..


ఇల్లెందు: మాట్లాడుతున్న చంద్ర అరుణ


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

**ఇల్లెందు:** సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే స్ఫూర్తితో ఉద్యమించాలని ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. మంగళవారం ఇల్లెందులోని జీసీసీ హమాలీల అడ్డాలో జరిగిన సభలో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కుల నిర్మూలనా సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. వేల సంవత్సరాలుగా జ్ఞానాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని అధికారాన్ని సమర్థించుకుంటూ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న మనువాద హిందుత్వ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడి కుల దోపిడీ వ్యవస్థ సత్యశోధక్ సమాజ్ 1873 సెప్టెంబర్ 24న ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, యాకుబ్‌షావలీ, శ్యామ్, బి.శ్రీను, రాజశేఖర్, సాయి, ఉపేందర్, చంద్రమౌళి, సాయి, రామచంద్రు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**టేకులపల్లి:** జోతీరావు పూలే సత్యశోధక్ సమాజ్ ద్వారా దేశంలో కులరహిత సమాజం కోసం ఎన్నో పోరాటాలు చేశారని, తన సహచరి సావిత్రీబాయి పూలేతో కలిసి జీవితాంతం కులరహిత సమాజానికి, దోపిడీ సమాజానికి వ్యతిరేకంగా పోరాడారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్ష్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సత్యశోధక్ 135వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రామచంద్, నోముల భానుచందర్, బోడ మంచా, శంకర్, వెంకటరామ్, బోడ మంగీలాల్, ఎట్టి నరసింహారావు, మేకల వినోద్, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**సింగరేణి(కొత్తగూడెం):** కుల వివక్షను ఎండగట్టి, నూతన సమాజాన్ని నిర్మిద్దామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు గౌని నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావం సందర్భంగా కుల నిర్మూలన, ఆచరణాత్మక కార్యక్రమం జరిగింది. మాట్లాడుతూ సమస్త సంపాదన సృష్టించే శ్రామికవర్గాలను కులాల వారీగా విభజించి సనాతన ధర్మాన్ని, మనువాదాన్ని ఎండగడుతూ నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే ఉమర్, సీతారామయ్య, ఎస్.సంజీవ్, మల్లికార్జున్‌రావు, మారుతి, రాఘవులు, సంధ్య, లక్ష్మి, నరసింహా, రామకృష్ణ పాల్గొన్నారు.

# గట్టాయిగూడెంలో సమస్యలెన్నో..

- సీసీ రోడ్డు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- గుంతలమయంగా మారిన రోడ్లతో స్థానికుల ఇబ్బందులు
- అధ్వానంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థ


గుంతలమయంగా మారిన గట్టాయిగూడెం రోడ్డు

**పాల్వంచ:** మున్సిపల్ పాల్వంచ డివిజన్ పరిధిలోని గట్టాయిగూడెంలో సమస్యలు తిష్ట వేశాయి. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ఏరియాలో స్థానికుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నటరాజ్ సెంటర్ నుంచి సీతారాంపట్నం వరకు ఈ రోడ్డు గుండానే నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అయితే, ఇక్కడి సమస్యలు దశాబ్దాల కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎన్నో విన్నపాల నేపథ్యంలో మంజూరైన రోడ్లకు సంబంధించి పనులు సైతం ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుత వర్షాలకు ఈ రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఇక డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**గుంతలతో ఇబ్బందులు..**

గట్టాయిగూడెం రోడ్లు అధ్వానంగా మారాయి. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి రాకపోకలు సాగించే వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఇటీవల గట్టాయిగూడెంనకు రూ.32.50 లక్షలు, గొల్లగూడెంలో రూ.7 లక్షలతో నిధులు మంజూరయ్యాయి. గత మే మాసంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు.

**డ్రెయినేజీలు అస్తవ్యస్తం..**

కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాల్వల్లో సరిగ్గా మురుగు తీయక పోవడంతో ఎక్కడికక్కడ జామ్ అవుతున్నాయి. దీంతో వర్షం వస్తే మురుగు నీరంతా రోడ్డుపైనే పారుతోంది. కాల్వలను సరిగా కలుపక పోవడంతో పైనుంచి వచ్చే నీరంతా రోడ్డుపైనే అనేక చోట్ల పారుతోందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల దశాబ్దాల క్రితం వేసిన డ్రెయిన్లు కావడంతో అవి ధ్వంసం అయినా వాటి స్థానంలో కొత్త డ్రెయినేజీలు వేయడం లేదు. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

**పనులు ప్రారంభం కాలేదు..**


ఏరియాలో ప్రధాన రోడ్లులో గుంతలు అధికంగా ఉన్నాయి. ఇటుగా తిరిగే వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గుంతల్లో నీళ్ల చేరి రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. గట్టాయిగూడెం రోడ్డుకు గత మే నెలలో శంకుస్థాపన చేసినా ఇంకా పనులు ప్రారంభం కాక పోవడంతో ఈ వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం.

– వెంకటరత్నం, గట్టాయిగూడెం

**డ్రెయినేజీ నీరంతా రోడ్డుపైనే..**


గట్టాయిగూడెం ఏరియాలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. పైనుంచి కాల్వల్లో వచ్చే నీరు కింది వరకు పోవడం లేదు. దీంతో వర్షం వచ్చిన సమయాల్లో మురుగు నీరు రోడ్డుపైనుంచి పారుతోంది. ఇంటి పక్క పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

– రవీందర్‌రెడ్డి, సీతారాంపట్నం

# కానరాని జమ్మి చెట్టు!

- రాష్ట్ర వృక్షంగా మాత్రమే చరిత్రపుటల్లోకి..
- హరితహారంలోనూ దక్కని ప్రాధాన్యత
- పండగ వేళ జమ్మి చెట్టు కోసం వెతుకులాట

**ఇల్లెందురూరల్:** దసరా సంబురాలు చివరి రోజుకి చేరుకోగానే అందరికీ గుర్తుకు వచ్చేది జమ్మి చెట్టు. దసరా సాయంత్రం వేళ జమ్మి చెట్టుకు పూజ చేయడం మన సంప్రదాయం. అంతటి ప్రాధాన్యత కలిగిన జమ్మి చెట్లు ప్రస్తుతం కనిపించడం లేదు. జమ్మి చెట్టు ఎలాంటి నేలలో అయినా పెరుగుతుంది. నీటి లభ్యత పెద్దగా లేకున్నా సుదీర్ఘకాలం బతికేస్తుంది. పట్టణం ప్రాంతవాసులకు జమ్మి ప్రయోజనాల గురించి పెద్దగా తెలియకపోవచ్చు. కానీ రైతులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జమ్మి అంటే ప్రాణం. దీని కొమ్మలు, ఆకులు పశువులకు మేతగా ఉపయోగపడుతాయి. దీని వేర్లు భూసారాన్ని పట్టి ఉంచుతాయి. ఈ చెట్టులోని ప్రతి భాగాన్ని నాటు వైద్యంలో ఔషధాలుగా వాడుతారు. ఈ చెట్టు నుంచి వచ్చే గాలిని పీల్చినా.. దీని చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఆరోగ్యం సమకూరుతుందని పెద్దల నమ్మకం.

**రాష్ట్ర వృక్షంగా గుర్తింపునిచ్చినా..**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక జమ్మి చెట్టును అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వృక్షంగా ప్రకటించింది. దేశంలో తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలలో మాత్రమే జమ్మి చెట్టుకు ఆ గౌరవం దక్కింది. కానీ జమ్మి చెట్ల సంరక్షణ, సంతతి పెంపునకు పాలకులు తీసుకున్న చర్యలు శూన్యం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక తొలి ఏడాదిలోనే హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాడు కేవలం అటవీశాఖ ఆధీనంలో మాత్రమే నర్సరీలు ఉండేవి. వాటిలో వివిధ రకాల మొక్కలు పెంచేవారు. స్వరాష్ట్రంలో జమ్మి చెట్లను విరివిగా పెంచాలని సంకల్పించిన నాటి ప్రభుత్వం తొలి ఏడాదిలో నర్సరీలలో జమ్మి మొక్కలను పెంచింది. ఆలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలలో జమ్మి మొక్కలను నాటించింది. కానీ ఆ తరువాత ఏడాది నుంచి నర్సరీలలో జమ్మి మొక్కల పెంపకం మాయమైంది. కేవలం అడవిజాతి మొక్కలను మాత్రమే పెంచారు. గ్రామపంచాయతీలకు సదుపాయాలు సమకూర్చిన నాటి ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేసింది. ఏటా ఒక్కో గ్రామపంచాయతీలో ఐదు వేల వరకు మొక్కలు పెంచడం ప్రారంభించారు. కానీ ఇక్కడ కూడా జమ్మి మొక్కలకు అవకాశం కల్పించలేదు. తొలి ఏడాదిలో నాటిన జమ్మి మొక్కల ఆలనాపాలనా కూడా నామమాత్రంగా ఉండటంతో అవి మొక్కలోనే మట్టిలో కలిసిపోయాయి. అభివృద్ధి పేరుతో జరిగిన విధ్వంసం కారణంగా ఉన్న కాసిన్ని జమ్మి చెట్లు కూడా క్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి.

**కొరవడిన సంరక్షణ...**

ప్రజలు అత్యంత పవిత్రమైందిగా, విజయానికి సూచికగా భావించే జమ్మి చెట్టు ప్రస్తుతం గ్రామాల్లోనూ ప్రస్తుతం కనిపించడం లేదు. మైసూర్ తరహాలో విజయదశమి వేడుకలు నిర్వహించడంలో దేశంలోనే ఇల్లెందుకు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి పట్టణంలో బ్రిటీష్ పాలన కాలం నుంచి జమ్మి చెట్టుకు పూజ చేయడం, దేవతామూర్తుల రథాలను చెట్టు వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు ఇల్లెందు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చేవారు. ఇలా వందేళ్లకు పైగా ఘనంగా పూజలందుకున్న జమ్మి చెట్టు క్రమంగా కనుమరుగైంది. ఈ పరిస్థితిలో అదే ప్రాంతంలో మరో మొక్క నాటకపోవడం, కారణం ఏదైనా జమ్మి మైదానంగా పేరొందిన ప్రాంతం నేడు ఆనవాళ్లు కూడా లేకుండా మారిపోయింది. కనీసం ఉత్సవాలు కూడా జరుపుకునే పరిస్థితి కూడా కనుమరుగైంది. గత చరిత్రను వల్లెవేసుకుంటూ దసరా ఉత్సవాలకు మైదానం వెతుక్కోవాల్సిన దుస్థితి ఇల్లెందులో నెలకొంది. ఇలా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఎంతో పవిత్రమైన, విజయానికి సూచికగా భావించే జమ్మి చెట్లు క్రమంగా కనమరుగవుతున్నాయి. ప్రస్తుతం దసరా పండుగ రోజున తాత్కాలికంగా జమ్మిచెట్టు కొమ్మలు తెచ్చి పూజ చేయాల్సిన పరిస్థితి.


టేకులపల్లి మండలం బోడు గ్రామ పొలిమేరలో జమ్మి చెట్టు